నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, గురువారం 13 మార్చి 2025 | KHAMMAM



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

## చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు

**– కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం, మార్చి 12 : చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఖమ్మం నగరం పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలు, విద్యాబోధన, రోజువారీ దినచర్య, స్కూల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పలు అంశాలపై విద్యాబోధన చేశారు. జువాలజీ పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. 10వ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తు, లక్ష్యాలను సాధించేందుకు మార్గదర్శకంగా ఉంటాయని సూచించారు. పరీక్షలకు 10రోజులూ ఉన్నందున సమయాన్ని వృథా చేయరాదన్నారు. జిల్లాలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, పాఠశాల హెచ్ఎం పోరిక ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘ఉపాధి’ లక్ష్యాలను పూర్తి చేయండి

- తాగునీటి సమస్యలుంటే సత్వరమే పరిష్కరించండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 12 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి ఉపాధి పథకం అమలు తీరు, ఆస్తి పన్ను వసూళ్ల పురోగతి, ధరణి, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం ఉన్న పనులపై దృష్టి సారించాలని, వంద రోజుల పనిదినాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫాం పాండ్స్, ఫీడర్ ఛానల్ పనులు, రోడ్డు ఫార్మేషన్, ట్రెంచ్ వర్క్ పనులు, బౌండరీలు తదితరాలకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా గ్రామాల అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసేలా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకచోట ఇంకుడు గుంతలు తవ్వకాలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే సత్వరమే పరిష్కరించి అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల ఎల్–1 జాబితాను శనివారంలోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సమీక్షలో డీఏవో బాబూరావు, డీపీవో చంద్రమౌళి, పీడీ హౌసింగ్ శంకర్, డీఈవో వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగులో మెళకువలు నేర్చుకోవాలి

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



రైతుతో మాట్లాడుతున్న పీవో రాహుల్

బూర్గంపాడు, మార్చి 12 : గిరిజన రైతులు సేంద్రియ సాగుపై మెళకువలు నేర్చుకోవాలని, సాగులో వారికి సలహాలు సూచనలు అందించే బాధ్యత తీసుకోవాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అభ్యుదయ రైతు లక్ష్మారెడ్డికి సూచించారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, అలాంటి పంటలు పండించడానికి రైతులు మొగ్గు చూపాలన్నారు. గట్టు లక్ష్మీపురం గ్రామంలో అభ్యుదయ రైతు లక్ష్మారెడ్డి సేంద్రియ ఎరువులతో సాగు చేస్తున్న పుచ్చకాయ, మిరప, జామ పంటలను బుధవారం పీవో పరిశీలించారు. పంట సాగు విధానం, యాజమాన్య పద్ధతుల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించడానికి ఆర్గానిక్ పంటలు వేసుకుంటే ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్న లక్ష్మారెడ్డిని గిరిజన రైతులు ఆదర్శంగా తీసుకొని సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. పామాయిల్ మొక్కలు పెంచుతూ అంతర పంటగా పుచ్చ, మిరప సాగు చేస్తున్న విధానం చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో ఏడీ అగ్రికల్చర్ ఉదయభాస్కర్, హార్టికల్చర్ అధికారి వేణుమాధవ్ పాల్గొన్నారు. అనంతరం సారపాకలోని గాంధీనగర్ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు.

## ‘సీతారామ’ నీరందించాలని నిరసన

**పిల్ల కాల్వలు నిర్మించి సాగునీరు ఇవ్వాలని సీపీఎం డిమాండ్**



సీతారామ కాల్వ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చండ్రుగొండ, మార్చి 12 : సీతారామ ప్రాజెక్టు కాల్వ నీటిని మండలంలోని పంట భూములకు అందించాలని కోరుతూ బెండాలపాడు గ్రామ సమీపంలోని కాల్వ వద్ద సీపీఎం నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పెద్దిని వేణు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా చిన్న కాల్వలు ఏర్పాటు చేసి మండలంలోని పంట భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అయితే జిల్లాలోని రైతుల పంట భూములకు సాగునీరు ఇవ్వకుండా ఇతర జిల్లాలకు నీరు తీసుకెళ్లడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే చిన్న కాల్వలు ఏర్పాటు చేసి నీరందించాలని, లేదంటే పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, రాజా, నాగుల్ మీరా, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి హామీ నిలబెట్టుకోవాలి

**బచ్చోడు కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు చేయాలని అఖిలపక్షం రాస్తారోకో**



బచ్చోడు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

తిరుమలాయపాలెం, మార్చి 12 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బచ్చోడు కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బచ్చోడు సెంటర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రజలు బుధవారం గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు పలువురు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బచ్చోడు కేంద్రంగా కొత్త మండలాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం బచ్చోడు కేంద్రంగా కొత్త మండలాన్ని ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి తక్షణమే కొత్త మండలం ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మండల సాధన కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు తిమ్మిడి హన్మంతరావు, జక్కుల యాదగిరి, తాటికొండ అనంతాచారి, ఎన్నబోయిన వెంకటరమణ, నీరుడు రమేశ్, గుజ్జ రామకృష్ణ, గొర్రెపాటి రామచంద్రు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఎండిపోయిన పొలం

# రోళ్లపాడు కింద నెర్రెలు



ఎండిపోయిన పొలంలో మేత మేస్తున్న గొర్రెలు



నెర్రెలు వారిన వరి పొలం

**గత కేసీఆర్ ప్రభుత్వంలో గోదావరి జలాలతో నింపేందుకు తొలి ప్రాధాన్యంగా ఎంపికైన రోళ్లపాడు ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం పక్కనబెట్టింది. ఫలితంగా ఆ రోళ్లపాడు ఆయకట్టు అన్నదాతలు ఆర్తనాదాలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కనీసం తూముల మరమ్మతులకు చొరవ చూపని కారణంగా.. దాని కింద వరి సాగు చేసిన రైతులు తమ పంటలపై ఆశలు వదులుకోవాల్సిన దయనీయ స్థితి ఏర్పడింది. రోళ్లపాడు జలాలపై భరోసాతో యాసంగిలో వరి సాగు చేసిన 120 ఎకరాల్లో ఇప్పుడు ఏకంగా 80 ఎకరాల మేర నెర్రెలు వారడం.. రోళ్లపాడు ప్రాజెక్టు పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. సదరు ప్రాజెక్టులోని జలాలపై నమ్మకంతో వందకు పైగా ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారన్న స్పృహ లేకపోవడం, కనీస మరమ్మతులు చేయించి కర్షకులకు సాగునీరు అందించాలన్న సోయి లేకపోవడం వంటి కారణాలతో చివరికి అన్నదాతలే తమ పంటలను కోల్పోవాల్సి వచ్చింది.** -ఇల్లెందు, మార్చి 12

- యాసంగికి ముందు ప్రాజెక్టులో సమృద్ధిగా సాగునీళ్లు
- వాటిపై భరోసాతో 120 ఎకరాల్లో వరి పంట వేసిన రైతులు
- తరువాత తూము నుంచి వృథాగా పోయిన జలాలు
- దీంతో అందులోని 80 ఎకరాల మేర నెర్రెలు వారిన పొలాలు
- మరమ్మతుల కోసం ముందడుగు వేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- గత సర్కారులో ‘సీతారామ’తో అనుసంధానానికి ప్రాధాన్యం
- ప్రస్తుత ప్రభుత్వంలో గోదావరి జలాలను తెచ్చేందుకు విముఖత
- లింక్ కెనాళ్ల ద్వారా పొరుగు జిల్లాలకు తరలింపునకే సుముఖత

జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి మొట్టమొదటగా టేకులపల్లి మండలం రోళ్లపాడు ప్రాజెక్టును నింపాలని, దీని ద్వారా ఈ ఏజెన్సీని సస్యశ్యామలం చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనేక చర్యలు చేపట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. లింక్ కెనాళ్ల ద్వారా సీతారామ జలాలను పొరుగు జిల్లాలకు తరలిస్తూ ఈ రోళ్లపాడు ప్రాజెక్టుపై శీతకన్ను వేసింది. కనీసం ఈ ప్రాజెక్టు మరమ్మతులనూ పట్టించుకోలేదు. అయినప్పటికీ ఇందులోని నీటిపైనే ఆధారపడుతూ దీని ఆయకట్టు రైతులు పంటలు పండించుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడం, ప్రాజెక్టులో నీరు నిండుగా ఉండడం వంటి కారణాలతో ఆయకట్టు రైతులు మంచిగానే పంటలు పండించుకున్నారు. వేసవిలో కూడా నీళ్లు మంచిగానే ఉండడంతో యాసంగికి మొగ్గు చూశారు. ఆయకట్టు పరిధిలో ఉన్న టేకులపల్లి మండలం బేతంపూడి, కోటల్ల, అబ్బిరెడ్డిగూడెం, టేకులపల్లి గ్రామాల రైతులు యాసంగి పంటగా సుమారు 120 ఎకరాల మేర వరి, పెసర, మినుము, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ఎంతో పెట్టుబడిని వెచ్చించారు. తీరా పంటలు చేతికి వచ్చే క్రమంలో రోళ్లపాడు ప్రాజెక్టు తూము గేటుకు లీకులు ఏర్పడ్డాయి. దీంతో అక్కడి నుంచి నీళ్లు వృథాగా బయటకు వెళ్లిపోతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం వెంటనే స్పందించలేదు. తూము గేటుకు మరమ్మతులు చేయించలేదు. చివరికి నీళ్లన్నీ లీకయిపోయాయి. ఫలితంగా రైతులు సాగు చేసిన పంటలకు కీలకమైన దశలో చుక్కనీళ్లు కూడా అందలేదు. దీంతో రైతులు సాగు చేసిన 120 ఎకరాల్లో 80 ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయి.

ముఖ్యంగా వరి పొలాలు నెర్రెలు వారాయి. దీంతో దిక్కులేని పరిస్థితుల్లో కొందరు రైతులు తమ వరి పొలాల్లో పశువులను మేపుతున్నారు.

### రూ.వేలల్లో ఖర్చు..

ఆరుగాలం శ్రమించి రెక్కలు ముక్కలు చేసుకున్నప్పటికీ కాసింత ప్రయోజనం కూడా లేకపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి రూ.వేలల్లో ఖర్చు చేసినప్పటికీ పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కాలువ దగ్గరలో ఉన్న రైతులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా తమ పంటలకు నీళ్లు పెట్టుకుంటున్నారు. కానీ ఒక్క తడికి రూ.వేలల్లో ఖర్చవుతోందని చెబుతున్నారు. ఒకవేళ రెండు, మూడు తడులు అవసరమైతే ఖర్చు మరింత పెరుగుతోందని తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి తూముకు మరమ్మతులు చేసి ఉంటే పంటలు ఎండిపోయేవి కావని, తాము కూడా ఇంతలా నష్టపోయేవాళ్లం కాదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. రోళ్లపాడు ప్రాజెక్టుకు గోదావరి జలాలను అందించి ఈ ప్రాంత రైతుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఆరెకరాలు కౌలుకు తీసుకున్నా..



రోళ్లపాడు ప్రాజెక్టు కింద నాకు రెండు ఎకరాల సొంత పొలం ఉంది. దానికి తోడు యాసంగిలో మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకున్నా. మొత్తం ఎనిమిది ఎకరాల్లో వరి పంట వేశా. నాట్లు వేస్తున్నప్పుడు రోళ్లపాడు ప్రాజెక్టులో నీళ్లు చాలానే ఉన్నాయి. కానీ పంట పొట్టదశకు వచ్చిన క్రమంలో తూము నుంచి నీళ్లన్నీ వెళ్లిపోయాయి. చుక్క నీళ్లు కూడా రాకపోవడంతో ఎనిమిది ఎకరాలూ నెర్రెలు వారాయి. రూ.1.50 లక్షల పెట్టుబడిని మొత్తం నష్టపోయా. మా ప్రాంతానికి సీతారామ ప్రాజెక్టు నీటిని అందించాలి.

–నెల్లూరి సందీప్, రైతు, టేకులపల్లి

### నీళ్ల కోసం ఇంజిన్ పెడుతున్నా..



నాకు రెండెకరాల పొలం ఉంది. దానిలో ఒక ఎకరంలో వరి, మరో ఎకరంలో మొక్కజొన్న వేశా. నీళ్లు రాకపోవడంతో వరి మొత్తం ఎండిపోయింది. దీంతో మొక్కజొన్ననైనా కాపాడుకుందామని ఆయిల్ ఇంజిన్ ద్వారా నీళ్లు పెడుతున్నా. రోజుకు రూ.2 వేల ఖర్చు వస్తోంది. ఇప్పటికే చాలా ఖర్చు పెట్టాను. చేతికొచ్చిన పంట ఎండిపోతుండడంతో బాధగా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి తూమును రిపేరు చేసి ఉంటే నీటి సమస్య వచ్చేది కాదు. రోళ్లపాడుకు గోదావరి నీళ్లిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. కానీ ఇప్పటి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

–ఏనుకు సోమయ్య, కోటల్ల, టేకులపల్లి మండలం



### తూము రిపేరుకొచ్చింది..

రోళ్లపాడు ప్రాజెక్టు తూము రిపేరుకొచ్చింది. కొత్తగా బిగించేందుకు షట్టర్ తెచ్చాము. కానీ నీళ్లు ఎక్కువగా ఉండడం వల్ల షెట్టర్ బిగించడం కుదరలేదు. ఇప్పుడు నీళ్లు తగ్గాయి. కాబట్టి త్వరలోనే ఆ షట్టర్‌ను ఏర్పాటు చేస్తాం. ఇది మైనర్ ప్రాజెక్టు. అందుకని వేసవి కాలం పంటలకు నీళ్లు పూర్తిస్థాయిలో అందవు.

–రవికుమార్, ఇరిగేషన్ డీఈ

## బీఆర్ఎస్ మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

- పెండింగ్ బిల్లుల విడుదల డిమాండ్‌పై ‘చలో హైదరాబాద్’కు సన్నద్ధం
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



కూసుమంచి మండలంలో మాజీ సర్పంచులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు


కూసుమంచి/ ఖమ్మం రూరల్, మార్చి 12: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మాజీ సర్పంచులు తలపెట్టిన ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రే రంగంలోకి దిగారు. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజాము వేళల్లో బీఆర్ఎస్ మాజీ సర్పంచుల ఇళ్ల వద్దకు వెళ్లారు. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. మధ్యాహ్నం తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పది మంది మాజీ సర్పంచులను, ఖమ్మంరూరల్ మండలంలో ఒక సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కూసుమంచి మండలంలో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ మాజీ సర్పంచులు కొండా సత్యం, బాణోత్ కిషన్, కాసాని సైదులు, తేజావత్ రాములు, జక్కుల వెంకటేశ్వర్లు, దామళ్ల మమత, కుంభం రమణ, రాయభారపు స్వాతి, నలబోలు మాధవి, వాసంశెట్టి అరుణ, ఖమ్మం రూరల్ మండలం నుంచి తీర్థాల మాజీ సర్పంచ్ బాలునాయక్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చలో హైదరాబాద్ వెళ్లడం లేదని చెప్పినా వినకుండా పోలీసులు తమను అరెస్టు చేశారని మండిపడ్డారు. కొద్ది నెలలుగా తాము చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన ప్రతిసారీ తమను ఇలాగే పోలీసులతో ప్రభుత్వం అరెస్టు చేయిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులను, బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### మాజీ వీఆర్ఏల ముందస్తు అరెస్టు

సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా కూసుమంచిలోని మాజీ వీఆర్ఏలను కూడా పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. సాయంత్రానికి విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మాజీ వీఆర్ఏలు సలువాది రాము, కందుల మోహన్, దాదె రాణి, చప్పిడి బాబు ఉన్నారు.

## పన్నుల భారం తగ్గించాలని మహా ధర్నా

**పట్టణ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకుల డిమాండ్**



వైరా మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వైరాటౌన్, మార్చి 12 : ప్రజలపై పన్నుల భారం తగ్గించాలని, పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు వైరాలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో భారీగా పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీ వద్ద వాగుపై కరకట్ట, డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద, గంధం టవర్స్ వద్ద శాశ్వత సైడ్ డ్రైనేజీ, డంపింగ్ యార్డు నిర్మించాలని, కుక్కల బెడద నివారించాలన్నారు. కేరళ తరహాలో పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం అమలు చేయాలని, ప్రధాన మార్గాల్లో సైడు కాల్వలు, అంతర్గత రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ వేణుకు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దిగ్గి కృష్ణ, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, తూము సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, సుధాకర్ పాల్గొన్నారు.




మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616